

## దాడికి దిగితే దీటుగా జవాబు

**పరస్పర సహకారానికి రష్యా, ఉత్తరకొరియా ఒప్పందం**

సియోల్: రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ బుధవారం నూతన భాగస్వామ్య ఒప్పందంపై సంతకం చేశారు. ఇందులో భాగంగా పాశ్చాత్య దేశాల నుంచి తమ రెండు దేశాల్లో ఎవరిపై దాడి జరిగినా పరస్పరం సహరించుకోవాలని నిర్ణయించారు. 24 ఏండ్ల తర్వాత తొలిసారిగా పుతిన్ ఉత్తరకొరియాలో పర్యటించారు. ఈ సందర్భంగా కిమ్‌కు పుతిన్ రష్యాకు చెందిన లగ్జరీ కారును బహుమానంగా అందజేశారు. కాగా, రష్యాలో కిమ్ పర్యటన సందర్భంగా కిమ్‌కు పుతిన్ ఓ లగ్జరీ కారును గిఫ్ట్‌గా ఇచ్చిన సంగతి తెలిసిందే.



నలంద యూనివర్సిటీ విహంగ వీక్షణం

# 'నలంద'కు కొత్త రూపు

**వర్సిటీ కొత్త క్యాంపస్‌ను ప్రారంభించిన ప్రధాని**

రాజ్‌గిర్, జూన్ 19: ప్రాచీన ప్రపంచ చరిత్రలో ఘన కీర్తి కలిగిన నలంద విశ్వవిద్యాలయం విలసిల్లిన చోట కొత్తగా నిర్మించిన ఆ యూనివర్సిటీ క్యాంపస్‌ను ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం ప్రారంభించారు. బీహార్ గవర్నర్ అర్లేకర్, సీఎం నితీశ్ కుమార్, విదేశాంగ మంత్రి జైశంకర్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అంతకు ముందు కొద్ది సేపు ప్రధాని మోదీ వర్సిటీకి సమీపంలోని నలంద మహా విహారను సందర్శించారు. 2014 నుంచి నలంద యూనివర్సిటీ కార్యకలాపాలు కొనసాగిస్తున్నది. కొత్త క్యాంపస్ ప్రారంభోత్సవంలో ప్రధాని మోదీ మాట్లాడుతూ భారత్‌ను అత్యాధునిక పరిశోధనలతో కూడిన ఉన్నత విద్యా వ్యవస్థ ద్వారా మళ్లీ అత్యంత ప్రముఖ జ్ఞాన కేంద్రంగా చూడాలనుకుంటున్నానని చెప్పారు. ఇందు కోసం దేశం చేస్తున్న ప్రయత్నాలు ఫలితాలను ఇవ్వడం ప్రారంభించాయని చెప్పారు. ఇటీవల క్యూఎస్ ర్యాంకింగ్స్‌లో 46 భారత విద్యా సంస్థలకు చోటు దక్కడం ఇందుకు నిదర్శనమన్నారు. పదేండ్ల క్రితం నాటితో పోలిస్తే దేశంలో అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు, ఐఐటీలు, ఐఐఎంల సంఖ్య పెరిగిందని తెలిపారు. పరిశోధనల కోసం కేంద్ర ప్రభుత్వం రూ. లక్ష కోట్లను కేటాయించిదని తెలిపారు.

## ఓటు వేయని వారికి ఉచిత బియ్యం ఇవ్వొద్దు

**ప్రధాని మోదీకి ముంబై బీజేపీ నేత లేఖ**

ముంబై జూన్ 19 ( నమస్తే తెలంగాణ): ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో ఓటు వేయని వారికి ఉచిత రేషన్ నిలిపివేయాలని బీజేపీ మహారాష్ట్ర ఉపాధ్యక్షుడు అర్జున్ గుప్తా వ్యాఖ్యానించారు. ఈ మేరకు ప్రధాని మోదీకి లేఖ రాశారు. లోక్‌సభ ఎన్నికల్లో ముంబైలో తక్కువ ఓటింగ్ శాతం నమోదవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. గత పదేళ్లుగా అమలు చేస్తున్న ఉచిత బియ్యం పథకాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ పథకాన్ని నేరుగా ఆపకుండా ఓటు వేసిన వారికే ఉచితంగా ధాన్యం ఇవ్వాలని కోరారు.






## ఆర్నెల్ల వ్యవధిలో కవలలకు జన్మ!

న్యూయార్క్: అమెరికాలోని న్యూయార్క్‌కు చెందిన ఎరిన్ క్లాన్సీ (42) అత్యంత అరుదైన ఘనత సాధించింది. ఓ నిర్మాణ కంపెనీ యజమానురాలైన ఆమె స్వయంగా ఓ బిడ్డకు జన్మనివ్వగా, ఆరు నెలల తర్వాత 1448 కిలోమీటర్ల దూరంలోని ఇల్లినాయిస్‌లో సరగేట్ మదర్ జన్మనివ్వడంతో మరో బిడ్డకు తల్లైంది. తనకు పుట్టిన బిడ్డకు డైలాస్ అని పేరు పెట్టుకోగా, సరగేట్ మదర్ ద్వారా జన్మించిన బాబుకు డెక్లాన్ అని పేరు పెట్టుకుంది. ఆరు నెలల వ్యవధిలో కవలలకు జన్మనివ్వడంపై ఆనందంతో ఆమె ఉబ్బితబ్బిబ్బవుతున్నది. 2016లో ఓ ఆన్‌లైన్ డేటింగ్ యాప్ ద్వారా పరిచయమైన బ్రియాన్‌ను ఆమె సెప్టెంబర్ 2020లో పెళ్లి చేసుకున్నది. 2021లో 39 ఏండ్ల వయసులో సంతానం కోసం ప్రయత్నించినప్పటికీ విఫలమైంది. ఆ తర్వాత ఐవీఎఫ్ చికిత్సకు వెళ్లినా నిరాశే ఎదురైంది. ఇక లాభం లేదని సరగసీ వైపు దృష్టిపెట్టి 2022లో ఓ ఏజెన్సీలో పేరు నమోదు చేసుకున్నారు. ఈ క్రమంలో అదే ఏడాది ఆగస్టులో ఆమె గర్భం దాల్చింది. అయినప్పటికీ సరగసీని కూడా కొనసాగించాలని నిర్ణయించింది. రెండు ప్రెగ్నెన్సీలు విజయవంతమయ్యాయి. మే 2023న ఆమె స్వయంగా డైలాస్‌కు జన్మనివ్వగా, నవంబర్‌లో ఇల్లినాయిస్‌లో ఆమె సరగేట్ మరో బిడ్డకు జన్మనిచ్చింది. ఇలా ఆరు నెలల వ్యవధిలో ఆమె ఇద్దరు పిల్లలకు తల్లయింది.

## వర్షాల కోసం సమాధులు తవ్వేస్తున్నారు!



బెంగళూరు, జూన్ 19: వర్షాలు పడాలని తమ పూర్వీకుల సమాధులను తవ్వుతున్నారు కర్ణాటకలోని హావేరీ ప్రాంత తవాసులు. చర్మవ్యాధులతో చనిపోయినవారి సమాధులను బయటికి తీసి.. దాన్ని వరుణుడికి చూపిస్తే శాంతించి వర్షాలు కురిసేలా చేస్తాడన్న మూఢ నమ్మకంతో ఈ పనులు చేస్తున్నారు. అంతేకాదు.. వర్షాల కోసం జంతువులు, బొమ్మలను పెండ్లి చేసుకుంటారు. నగ్నంగా ఊరంతా తిరుగుతూ బిక్షం అడుగుతారు. ఇలా చేస్తే వరుణ దేవుడు కరుణించి వర్షాలు కురిపిస్తారని వారి నమ్మకం. రుతుపవనాలు ఒక్కసారిగా కనుమరుగు కావటంతో గత రెండు వారాలుగా సమాధులను తవ్వి.. మళ్లీ కుటుంబసభ్యుల సమక్షంలో అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు. ఇలా చేస్తే కొత్త శక్తితో వర్షాలు తిరిగి వస్తాయని పేర్కొంటున్నారు.

## బేటీ పడావోను తప్పుగా రాసిన కేంద్రమంత్రి

**ప్రతిపక్షాల విమర్శలు**



ధార్, జూన్ 19: 'బేటీ పడావో, బేటీ బచావో' నినాదాన్ని కేంద్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సావిత్రి ఠాకూర్ హిందీలో తప్పుగా రాశారు. మంగళవారం మధ్యప్రదేశ్‌లోని ధార్‌లో జరిగిన స్కూల్ చలో అభియాన్ కార్యక్రమంలో జరిగిన ఈ ఘటనపై కాంగ్రెస్, బీజేపీ పరస్పర విమర్శలు చేసుకొన్నాయి. చిన్న నినాదాన్ని కూడా మంత్రి సరిగా రాయలేకపోవడంపై కాంగ్రెస్ సీనియర్ నేత కేకే మిశ్రా స్పందిస్తూ.. 'రాజ్యాంగబద్ధ పదవుల్లో ఉంటూ పెద్ద శాఖలు చూస్తున్న వ్యక్తులకు తమ మాతృభాషలో సైతం సామర్థ్యం లేకపోవడం దురదృష్టకరం. వాళ్లు తమ శాఖలను సమర్థంగా ఎలా నిర్వహించగలరు?' అని అన్నారు. ఎన్నికల్లో పోటీ చేసేవారికి కనీస విద్యార్హత నిబంధనను రాజ్యాంగం విధించాలని అభిప్రాయపడ్డారు. ఈ విమర్శలపై ధార్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు స్పందిస్తూ.. మంత్రి తొందరపాటులో చేసిన తప్పును కాంగ్రెస్ పెద్దది చేసి చూపడం ఆ పార్టీ అల్పమైన ఆలోచనలకు, గిరిజన వ్యతిరేకతకు నిదర్శనమని అన్నారు. తాజా ఎన్నికల్లో సమర్పించిన అఫిడవిట్ ప్రకారం సావిత్రి ఠాకూర్ 12వ తరగతి ఉత్తీర్ణురాలయ్యారని స్వాతి దీక్షిత్ అనే నెటిజన్ ఎక్స్‌లో పేర్కొన్నారు.

## వృద్ధుడిలా వేషమేసుకుని కెనడా వెళ్లే యత్నం

**ఢిల్లీలో యువకుడి అరెస్ట్**



న్యూఢిల్లీ, జూన్ 19: వృద్ధుడి వేషధారణలో కెనడా వెళ్లేందుకు యత్నించిన 24 ఏండ్ల యువకుడిని ఢిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయంలో సీఐఎస్ఎఫ్ సిబ్బంది అరెస్టు చేశారు. గడ్డానికి, జుట్టుకు రంగు వేసుకొని వృద్ధుడి మాదిరిగా మంగళవారం సాయంత్రం విమానాశ్రయానికి వచ్చిన గురుసేవక్ సింగ్ అనే ప్రయాణికుడి కదలికలు అనుమానాస్పదంగా ఉండటంతో టెర్మినల్-3 వద్ద సీఐఎస్ఎఫ్ సిబ్బంది అదుపులోకి తీసుకొని పోలీసులకు అప్పగించారు. రష్విందర్‌సింగ్ సహోటా 67 ఏండ్ల వృద్ధుడిగా నకిలీ పాస్‌పోర్టుతో విమానాశ్రయానికి వచ్చాడు. గడ్డం, జుట్టు తెల్లగా వృద్ధుడి తరహాలో ఉన్నప్పటికీ అతడి స్కిన్, కదలికలు చురుకుగా ఉండటంతో అనుమానం వచ్చి అతడిని అదుపులోకి తీసుకున్నట్టు సీఐఎస్ఎఫ్ అధికారి బుధవారం వెల్లడించారు. తదుపరి విచారణ నిమిత్తం యువకుడిని ఢిల్లీ పోలీసులకు అప్పగించినట్టు పేర్కొన్నారు.






## అమెజాన్ పార్సిల్‌లో పాము!

అమెజాన్‌లో ఎక్స్ బాక్స్ కంట్రోలర్‌ను ఆర్డర్ చేసిన ఓ బెంగళూరు జంటకు భయంకరమైన అనుభవం ఎదురైంది. పార్సిల్‌ను విప్పడానికి ప్రయత్నించినప్పుడు లోపల నుంచి పాము బయటికి వచ్చింది. అయితే అది టేపుకు ఇరుక్కుపోవడంతో ప్రమాదం తప్పింది. ఈ ఘటనపై నెటిజన్ల నుంచి పెద్దయెత్తున విమర్శలు రావడంతో ఎట్టకేలకు పార్సిల్ అందుకున్న జంటకు అమెజాన్ క్షమాపణలు చెప్పింది.

## 80 వేల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నా..

**అర్హులైన అభ్యర్థులు లేరట • టీసీఎస్‌లో చిత్రమైన పరిస్థితి**

న్యూఢిల్లీ: భారత దిగ్గజ ఐటీ కంపెనీగా పేరొందిన టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్‌లో విచిత్రమైన పరిస్థితి కొనసాగుతున్నది. ఆ కంపెనీలో దాదాపు 80 వేల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నప్పటికీ వాటిని భర్తీ చేయలేని పరిస్థితి ఏర్పడింది. అర్హులైన అభ్యర్థులు అందుబాటులో లేకపోవడమే ఇందుకు కారణమని తెలుస్తున్నది. ఇది ఆ కంపెనీలోని ప్రస్తుత ఉద్యోగుల నైపుణ్యాలకు, కంపెనీ అవసరాలకు మధ్య ఉన్న భారీ వ్యత్యాసాన్ని (స్కిల్ గ్యాప్‌ను) స్పష్టం చేస్తున్నది. దీంతో ఈ లోటును పూడ్చుకునేందుకు కాంట్రాక్టర్లపై ఆధారపడాల్సి వస్తున్నదని టీసీఎస్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ గ్రూప్ (ఆర్ఎంజీ) గ్లోబల్ ఆపరేషన్స్ హెడ్ అమర్ షెట్యే తెలిపారు. కాగా, ఫ్రెషర్లను ఉద్యోగాల్లో చేర్చుకోవడంలో టీసీఎస్‌తోపాటు ఇతర భారత ఐటీ దిగ్గజాలు సాచివేత ధోరణిని అవలంబిస్తున్నట్టు వార్తలు వస్తున్నాయి. ఈ జాప్యాల వల్ల గత రెండేళ్లలో దాదాపు 10 వేల మంది ఫ్రెషర్లు నష్టపోయినట్టు నాస్కెంట్ ఐటీ ఎంప్లాయీస్ సెనేట్ వెల్లడించింది.

## సంక్షిప్త వార్తలు

### • కేజ్రీవాల్ కస్టడీ జూలై 3 వరకు పొడిగింపు

న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం పాలసీ కేసులో ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ జ్యుడీషియల్ కస్టడీని ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు జూలై 3 వరకు పొడిగించింది. గతంలో విధించిన కస్టడీ ముగిసిన నేపథ్యంలో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కేజ్రీవాల్ విచారణకు హాజరయ్యారు. కస్టడీ పొడిగించాలన్న ఈడీ వాదనను కేజ్రీవాల్ న్యాయవాది వ్యతిరేకించారు. ఇరు పక్షాల వాదనలు విన్న ప్రత్యేక న్యాయమూర్తి నియయ్ బిందు కస్టడీని పొడిగిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

### • నీటి సమస్య తీర్చకపోతే నిరాహార దీక్ష: ఆతిశీ

న్యూఢిల్లీ, జూన్ 19: మండే ఎండలకు తోడు నీటి సంక్షోభంతో ఢిల్లీ ప్రజలు అల్లాడిపోతున్నారు. ఢిల్లీ నీటి సంక్షోభంపై స్పందించాలని.. సమస్యను పరిష్కరించాలని రాష్ట్ర జల మంత్రి ఆతిశీ బుధవారం ప్రధాని మోదీకి లేఖ రాశారు. మరి కొద్ది రోజుల్లో సమస్యను పరిష్కరించకపోతే, శుక్రవారం నుంచి నిరవధిక నిరాహార దీక్షను చేపడతానంటూ లేఖలో ఆమె తెలిపారు.

### • హౌతీ రెబల్స్ దాడి.. మునిగిన మరో నౌక

దుబాయ్, జూన్ 19: యెమెన్ దేశానికి చెందిన హౌతీ రెబల్స్ ఎర్ర సముద్రం వెంబడి మళ్లీ దాడులకు తెగబడ్డారు. వారు జరిపిన 'డ్రోన్-బోట్' దాడిలో లైబీరియా జెండాతో వెళ్తున్న గ్రీక్‌కు చెందిన 'ట్యూటర్' వాణిజ్య నౌక సముద్రంలో మునిగింది. దాడిలో ఒక మెరైనర్ కూడా చనిపోయాడని బ్రిటన్ మిలటరీ వర్గాలు బుధవారం వెల్లడించాయి. ఇజ్రాయెల్-హమాస్ యుద్ధం నేపథ్యంలో ఇరాన్ మద్దతుతో హౌతీ తిరుగుబాటుదారులు ఎర్రసముద్రంలో నౌకలపై దాడులకు దిగుతున్నారు. వీరి దాడిలో ఇదివరకే ఒక నౌక ఎర్రసముద్రంలో మునిగిపోయింది.

### • పోస్టాఫీస్ పేరుతో ఫేక్ మెసేజ్‌లు

న్యూఢిల్లీ: సైబర్ నేరగాళ్లు ప్రజల డబ్బులు కొల్లగొట్టేందుకు కొత్త ఎత్తులు వేస్తున్నారు. తాజాగా పోస్టాఫీసు పేరుతో వేల మందికి ఎక్స్‌లో ఫేక్ మెసేజ్‌లు పంపిస్తున్నారు. మీ ప్యాకేజీ గోదాముకు చేరుకున్నదని, దానిని మీరు పొందడానికి 48 గంటల్లోగా అడ్రస్ అప్‌డేట్ చేసుకోవాలని సూచిస్తున్నారు. ఆ ఫేక్ మెసేజ్ లింకును వినియోగదారులు ఓపెన్ చేయవద్దని, పొరపాటున ఓపెన్‌చేస్తే సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కుకొని డబ్బులు కోల్పోయే ప్రమాదం ఉన్నదని ప్రెస్ ఇన్‌ఫర్మేషన్ బ్యూరో ఫ్యాక్ట్ చెక్ వెల్లడించింది. పార్సిల్ డెలివరీ కోసం అడ్రస్ అప్‌డేట్ కోరుతూ భారత తపాలాశాఖ ఎప్పుడూ ఇలాంటి మెసేజ్‌లను పంపబోదని స్పష్టంచేసింది. నకిలీ సందేశాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.




